అన్నదాతకు భరోసా ఏదీ ?

- రైతులకు తప్పని సాగు కష్టాలు
- పెట్టుబడి సాయం ఊసెత్తని టీడీపీ కూటమి సర్కార్
- తుపాన్ ముంచినా పట్టించుకోని వైనం


ఇటీవల వర్షాలకు నీట మునిగిన వరిపైరు

పాణ్యం: అన్నదాతలకు సాగు కష్టాలు తప్పడం లేదు. వర్షాభావ పరిస్థితులు వెంటాడుతూనే ఉన్నాయి. అండగా నిలవాల్సిన ప్రభుత్వం పట్టించుకోవడం లేదని అన్నివర్గాల నుంచి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రత్యేకించి ఖరీఫ్ సీజన్ ముగిసినా కనీసం పెట్టుబడి సాయం అందజేయని టీడీపీ కూటమి ప్రభుత్వ తీరును తప్పుపడుతున్నారు రైతులు. తప్పని పరిస్థితుల్లో ఆర్థిక కష్టాలు పడుతూనే రబీ సీజన్ పనులు కూడా ప్రారంభించారు. ఎన్నికల ముందు రైతులకు పెట్టుబడి సాయంగా రూ. 20 వేలు అందజేస్తామని హామీలు గుప్పించిన చంద్రబాబు ఆ ఊసే ఎత్తడం లేదని రైతులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేసిన రైతుభరోసా పథకం పేరును కూటమి పెద్దలు అన్నదాత సుఖీభవ అంటూ పేరు మార్చారే తప్పా కనీసం భరోసా కల్పించడం లేదని రైతులు విమర్శలు గుప్పిస్తున్నారు. ఈ నేపథ్యంలో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సాగుకు అండగా నిలిచిని తీరును గుర్తు చేసుకుంటున్నారు అన్నదాతలు.

వ్యవసాయ రంగానికి ప్రాధాన్యతనిచ్చిన గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వ్యవసాయ రంగానికి అత్యధిక ప్రాధాన్యతనిచ్చింది. పెట్టుబడి సాయంతోపాటు ఏదైనా నష్టం వాటిల్లినా నష్టపరిహారం అందజేసి అండగా నిలిచింది. 2019–24మధ్య కాలంలో సీజన్ ప్రారంభంలోనే పెట్టుబడి సాయం అందేదని రైతులు గుర్తు చేసుకుంటున్నారు. సకాలంలో రాయితీపై ఆర్‌బీకేల ద్వారా విత్తనాలు అందేవి. ప్రకృతి వైపరీత్యాల వల్ల నష్టపోయిన రైతులకు అదే సీజన్‌లో పంట నష్ట పరిహారం రైతుల ఖాతాలో జమ అయ్యేది. దిగుబడులకు కూడా మద్దతు ధర కల్పించేందుకు ధరల స్థిరీకరణ ఏర్పాటు చేసిన విషయాన్ని రైతులు గుర్తు చేసుకుంటున్నారు.

95హెక్టార్లే పంట నష్టమట

మండలంలో ఖరీఫ్‌లో 16,834ఎకరాల్లో 5,990మంది రైతులు వివిధ పంటలను సాగు చేశారు. ఇటీవల కురిసిన వర్షాలకు తడిసిముద్ద య్యాయి. రైతులు తీవ్రంగా నష్టపోయారు. అయితే తుపాన్ మూలంగా కేవలం 95హెక్టార్లలో పంట నీటమునిగినట్టు అధికారులు అంచనా. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. అయితే నివేదికలతో సరిపెడుతారా... పరిహారం అందజేసి ఆదుకుంటారా అనే విషయం ప్రశ్నార్థకంగా మిగిలింది. ఎందుకంటే ఏ అధికారి సరైన భరోసా కల్పించలేని పరిస్థితి. గత ప్రభుత్వంలో అధికారులు ఎప్పటికప్పుడు పంట నష్టం అంచనా వేసి పరిహారం కూడా అదే సీజన్లో అందజేసిన పరిస్థితి.

'రైతుభరోసా' 2019-23వరకు లబ్ధిపొందిన రైతుల వివరాలు

సంవత్సరం	రైతులు	చేకూరిన లబ్ధి
2020-21	7,374	రూ.5,53,05,000
2021-22	7,403	రూ.5,55,22,500
2022-23	7,704	రూ.5,77,79,500
క్రాప్ ఇన్స్యూరెన్స్ వివరాలు		
2020-21	1016	రూ.61,60,016
2021-22	555	రూ.73,25,447
2022-23	923	రూ.1,09,05,074
పంటనష్టం పరిహారం వివరాలు		
సంవత్సరం	రైతులు	చేకూరిన లబ్ధి
2021-22	885	రూ.63,17,950
2022-23	209	రూ. 41,69,150

రైతుకు అండగా గత ప్రభుత్వం



గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రైతుకు అండగా నిలిచింది. వ్యవసాయానికి అత్యధిక ప్రాధాన్యనిస్తూ రైతులను అన్ని విధాలుగా ప్రోత్సహించింది. కూటమి ప్రభుత్వం రైతుల సమస్యలను పట్టించుకోవడం లేదు. కనీసం పెట్టుబడి సాయం కూడా అందించలేదు. ఖరీఫ్ సీజన్‌లో అందాల్సిన పెట్టుబడి సాయం రబీలోనైనా ఇస్తే బాగుంటుంది. తుపాన్ ప్రభావంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. అయినా ప్రభుత్వం నుంచి కనీసం స్పందన లేదు.

– సద్దల శ్రీనివాసరెడ్డి, గగ్గటూరు

రైతు సమస్యలపై నిర్లక్ష్యం తగదు



టీడీపీ కూటమి ప్రభుత్వం రైతుల సమస్యలను నిర్లక్ష్యం చేస్తుంది. వ్యవసాయ రంగాన్ని ఏ మాత్రం పట్టించుకోవడం లేదు. ఎన్నికల ముందు టీడీపీ నేతలు ఇచ్చిన హామీలను విస్మరించారు. పెట్టుబడి సాయం అందించకపోవడంతో రైతులు ఇబ్బంది పడుతున్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలి.

– మహేంద్రారెడ్డి, మద్దూరు

క్లుప్తంగా

మహిళా సంఘాలతోనే ప్రకృతి వ్యవసాయ విస్తరణ


శిక్షణ ఇస్తున్న డీఎల్‌ఎంపీ లక్ష్మయ్య

ఓర్వకల్లు: పొదుపు మహిళా సంఘాల భాగస్వామ్యంతోనే ప్రకృతి వ్యవసాయ విస్తరణ సాధ్యమవుతుందని ప్రాజెక్టు డీఎల్‌ఎంపీ లక్ష్మయ్య తెలిపారు. శుక్రవారం స్థానిక పొదుపు లక్ష్మి ఐక్య భవనంలో ఒక్క రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఏపీఎం వెంకటరామిరెడ్డి అధ్యక్షతన జరిగిన శిక్షణ కార్యక్రమానికి లక్ష్మయ్యతో పాటు, ఎంపీడీఓ శ్రీనివాసులు హాజరయ్యారు. ఈ సందర్భంగా డీఎల్‌ఎంపీ మాట్లాడుతూ జిల్లాలో ప్రకృతి వ్యవసాయాన్ని మరింత సమర్థవంతంగా నిర్వహించాలనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం మహిళా సంఘాలకు అధిక ప్రాధాన్యతనిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో ఎంటీఎల్ వంశీకృష్ణ, హెచ్ఎన్ఎన్ ఎఫ్ఏ అరుణ, ఎన్ఎఫ్ఎఫ్ యశశ్విని, సీసీలు, రఫిక్, నాయక్ ఎంటీఎస్, ఖాసీం, రమణ, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

వంతెన పరిశీలన


తుమ్మలవాగు వంతెనను పరిశీలిస్తున్న ఆర్అండ్‌బీ ఎస్ఈ మహేశ్వరరెడ్డి

కర్నూలు (రూరల్) : కర్నూలు మండల పరిధిలోని ఉల్చాల గ్రామ సమీపాన ఉన్న తుమ్మల వాగు వంతెనను శుక్రవారం ఆర్అండ్‌బీ ఎస్ఈ మహేశ్వరరెడ్డి పరిశీలించారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు వంతెన తెగిపోయింది. ఈ మేరకు సమస్యను వివరిస్తూ డీవైఎఫ్ఐ నాయకులు శుక్రవారం ఉదయం వినతి పత్రం అందజేశారు. గ్రామస్తుల ఇబ్బందులను డీవైఎఫ్ఐ నాయకులు రాఘవేంద్ర ఎస్ఈ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఎస్ఈ సాయంత్రం వంతెనను పరిశీలించారు. ప్రభుత్వం నుంచి నిధులు మంజూరైన వెంటనే వంతెన నిర్మాణం చేపడుతామని ఈ సందర్భంగా ఎస్ఇ హామీ ఇచ్చారు.

సచివాలయం ఎదుట కాటికాపరుల ధర్నా


గోడకు వినతిపత్రాన్ని అంటించిన కాటికాపరులు

కర్నూలు(రూరల్) : సమస్యలు పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం ఆర్‌కే దుద్యాల సచివాయం ఎదుట కాటికాపరులు ధర్నా చేశారు. శ్మశానంలో గుంతలు తీసే వృత్తిని నమ్ముకుని జీవనం సాగిస్తున్న తమను నాల్గవ తరగతి ఉద్యోగులుగా గుర్తించాలని కాటికాపరులు డిమాండ్ చేశారు. అనంతరం సచివాలయ ఉద్యోగులు వినతి పత్రం తీసుకోకపోవడంతో కాటికాపరులు గోడకు అతికించారు. కార్యక్రమంలో గ్రామ నాయకులు చిన్న అయ్యస్వామి, ఈశ్వరి, ఏబు, లక్ష్మన్న, రాజు తదితరులు పాల్గొన్నారు.

తపాల ఉద్యోగుల నిరసన


పాణ్యం సబ్‌పోస్టాఫీసు వద్ద నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

పాణ్యం: సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం తపాలా ఉద్యోగులు నల్లబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరై నిరసన తెలిపారు. నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ పోస్టల్ ఎంప్లాయిస్ ఆల్ ఇండియా గ్రామీణ తపాల ఉద్యుగుల సంఘం పిలుపు మేరకు నిరసన తెలుపుతున్నామని ఉద్యోగులు తెలిపారు. అరచణకు సాధ్యం కాని టార్గెట్లు విధించి వేధిస్తున్నారని ఉద్యోగులు ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పోస్టుమాస్టర్ సుధీర్, సిబ్బంది శేఖర్, షాహింషా, ఫయాజ్‌బాషా, ప్రియాంక, మహిత తదితరులు పాల్గొన్నారు.

హామీలు అమలు చేయాలి

కర్నూలు సిటీ: ఎన్నికల సమయంలో ఎన్డీఏ కూటమి విద్యార్థులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు సోమన్న డిమాండ్ చేశారు. శుక్రవారం నగరంలోని ఓ కార్పొరేట్ కాలేజీలో ఆ సంఘం సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న విద్యా వ్యతిరేక విధానాలపై పోరాటాలు చేసేందుకు విద్యార్థులు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. దేశ స్వాతంత్ర సంగ్రామం పోరాటంలో పాల్గొన్న ఏకైక విద్యార్థి సంఘం ఏఐఎస్ఎఫ్ అని, వచ్చే నెల 12, 13 తేదీల్లో 30వ జిల్లా మహాసభలను ఆదోని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. విద్యార్థులందరూ పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఆ సంఘం నాయకులు అభి, అశోక్, కె.మధు, అంజి, మహేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలు పూర్తి చేసుకోవాలి


లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఎంపీడీఓ రాముడు,


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ రాణెమ్మ

కోడుమూరు రూరల్ : గృహ నిర్మాణాలను త్వరగా పూర్తి చేసుకోవాలని ఎంపీడీఓ రాముడు లబ్ధిదారులకు సూచించారు. మండలంలోని ఎర్రదొడ్డిలో శుక్రవారం ఎంపీడీఓ పర్యటించారు. గ్రామంలో గృహ నిర్మాణ పథకం కింద నిర్మించుకుంటున్న ఇళ్లను పరిశీలించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ గ్రామంలో మొత్తం 30మంది లబ్ధిదారులకు ఇండ్లు మంజూరైతే 25మంది ఇండ్ల నిర్మాణాలను పూర్తి చేసుకున్నారని, మిగిలిన ఐదుగురు కూడా త్వరగా పూర్తి చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో హౌసింగ్ వర్క్ ఇన్‌స్పెక్టర్లు రామునాయక్, అప్రోజ్, ఇంజినీరింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

సి.బెళగల్: గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలని ఎంపీడీఓ రాణెమ్మ సూచించారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ బొంతల మునెప్ప, హౌసింగ్ ఏఈ సుమంత్, డీఆర్‌డీఏ వెలుగు ఏపీఎం రామేశ్వర్‌తో కలిసి వెలుగు సీసీలు, గ్రామ సచివాలయ ఇంజినీర్ అసిస్టెంట్లతో ఎంపీడీఓ సమావేశం నిర్వహించారు. గృహ నిర్మాణాలు మూడు నెలలోగా పూర్తయ్యేలా చూడాలని ఈ సందర్భంగా ఎంపీడీఓ అధికారులకు సూచించారు.

రైతులకు న్యాయం చేస్తాం

కర్నూలు (రూరల్) : కర్నూలు మండలంలో బి.తాండ్రపాడు గ్రామం నుంచి వెళ్లే 340సి నేషనల్ హైవే రోడ్డును శుక్రవారం కర్నూలు ఆర్డీఓ కిడారి సందీప్ కుమార్ పరిశీలించారు. రైతులు, గ్రామస్తులకు అనుకూలంగా సర్వీసు రోడ్లను ఏర్పాటు చేస్తామని ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. రోడ్డు నిర్మాణంలో భూమి కోల్పోయి పరిహారం అందని రైతులకు న్యాయం చేస్తామన్నారు. అదేవిధంగా హైవే రోడ్డు పనులకు అదనంగా సేకరిస్తున్న మూడుఎకరాల భూమి వివరాలను తహసీల్దార్ టీవీ రమేష్ బాబును అడిగి తెలుసుకున్నారు.

న్యాయం చేయాలి

కర్నూలు(సెంట్రల్): టీడీపీకి చెందిన రౌడీషీటర్ రాగి నవీన్ చేతిలో హతమైన తెనాలికి చెందిన యువతి సుహాన కుటుంబాన్ని సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, హోం మంత్రి అనిత పరామర్శించకపోవడం అన్యాయమని ఆవాజ్ రాష్ట్ర కమిటీ సభ్యులు పి.ఇక్బాల్ హుస్సేన్, ఎస్ఎండీ షరీఫ్‌లు శుక్రవారం ఓ ప్రకటనలో విమర్శించారు. నిందితుడిపై నిర్భయ చట్టాన్ని అమలు చేసి ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ద్వారా ఉరిశిక్ష పడేలా చేయాలని కోరారు. బాధిత కుటుంబానికి రూ.10 లక్షల పరిహారం ఇవ్వాలని కోరారు.

ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలి


ఏఓ వేణుగోపాలరావుకు వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

కర్నూలు (రూరల్) : కల్లూరు మండలం పెద్దపాడు గ్రామంలో వంకనుపూడ్చి ప్లాటు వేసిన ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలని సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు రామకృష్ణ డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం సీపీఎం మండల కార్యదర్శి కె.మధు ఆధ్వర్యంలో ఆర్‌డీఓ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండు సంవత్సరాలుగా సమస్యను పరిష్కరించాలని ఆందోళన చేస్తున్నా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా తగిన చర్యలు తీసుకోకపోతే ఆర్‌డీఓ కార్యాలయాన్ని ముట్టడిస్తామని చేస్తామని హెచ్చరించారు. అనంతరం ఏఓ వేణుగోపాల్‌రావుకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఎం పెద్దపాడు శాఖ కార్యదర్శి గోపి, నాయకుడు పందిపాడు శ్రీను, గ్రామస్తులు ఏసురాజు, చిన్నరాముడు, పెద్దరాముడు తదితరులు పాల్గొన్నారు.

29న సివిల్ సర్వీస్ ఉద్యోగులకు ఎంపిక పోటీలు

కర్నూలు (టౌన్): స్థానిక స్పోర్ట్స్ అథారిటీ ఔట్‌డోర్ స్టేడియంలో సివిల్ సర్వీసెస్ ఉద్యోగులకు ఈనెల 29న జిల్లాస్థాయి ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి బి.భూపతి రావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అథ్లెటిక్స్, బ్యాడ్మింటన్, బెస్ట్ ఫిజిక్, బాస్కెట్‌బాల్, క్యారమ్స్, చెస్, క్రికెట్, ఫుట్‌బాల్, హాకీ, కబడ్డీ, లాన్ టెన్నిస్, ఖోఖో, స్విమ్మింగ్, టేబుల్ టెన్నిస్, వాలీబాల్, వెయిట్ లిఫ్టింగ్, పవర్ లిఫ్టింగ్, రెజ్లింగ్, యోగా క్రీడాంశాలలో పోటీలు ఉంటాయని పేర్కొన్నారు. జిల్లాస్థాయి ఎంపిక పోటీలో పాల్గొనే ఉద్యోగులు ఐడీ కార్డు, ఆధార్ కార్డు తప్పనిసరిగా తీసుకు రావాలని సూచించారు. ప్రతి ఉద్యోగి రెండు క్రీడాంశాల్లో కంటే ఎక్కువగా పాల్గొనరాదని పేర్కొన్నారు. ఎంపికైన క్రీడాకారులు వచ్చే నెల 6 నుంచి 9వ తేదీ వరకు విజయవాడలోని ఇందిరాగాంధీ స్టేడియంలో నిర్వహించనున్న ఆలిండియా సివిల్ సర్వీసెస్ ఉద్యోగుల పోటీల్లో పాల్గొంటారని వెల్లడించారు.

నవజాత శిశువుకు అరుదైన చికిత్స


కోలుకున్న శిశువుతో వైద్యుల బృందం

కర్నూలు(హాస్పిటల్): ఏడో నెలలో కేవలం 900 గ్రాముల బరువుతో జన్మించిన శిశువుకు కర్నూలు అశ్విని హాస్పిటల్ వైద్యులు మెరుగైన వైద్యంతో పునర్జన్మ అందించారు. చికిత్స వివరాలను శుక్రవారం చిన్నపిల్లల వైద్యుడు నాగేశ్వర రెడ్డి, డాక్టర్ వీరరత్నాకర్‌రెడ్డి వివరించారు. స్థానిక ఎన్ఆర్ పేటకు చెందిన రంజిత మొదటి కాన్పు కోసం ఇటీవల అశ్విని హాస్పిటల్‌లో చేరింది. ఆమెకు బీపీ ఎక్కువగా ఉండటంతో గత నెల 20న వైద్యులు అత్యవసరంగా ఏడో నెలలోనే సిజేరియన్ ద్వారా కాన్పు చేశారు. శిశువు 930 గ్రాముల బరువు మాత్రమే ఉంది. ఐదు రోజుల తర్వాత మరింత తగ్గి 820 గ్రాములకు చేరింది. దీంతో పాటు ఆయాసం, ఊపిరితిత్తుల్లో ఇన్‌ఫెక్షన్ మొదలు కావడంతో ఒక రోజు వెంటిలేటర్ అమర్చి, అనంతరం అవసరమైన మందులు, పోషకాహారం ఇస్తూ వైద్యులు చికిత్స అందించారు. నెలరోజుల తర్వాత శిశువు పూర్తిగా కోలుకోవడంతో శుక్రవారం ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ చేశారు. మెరుగైన వైద్యం అందించిన డాక్టర్లకు బాలింత కుటుంబీకులు కృతజ్ఞతలు తెలిపారు.

డీఈఓను కలిసిన విద్యార్థి నాయకులు

కర్నూలు సిటీ: జిల్లా విద్యాశాఖ అధికారిగా బాధ్యతలు స్వీకరించిన ఎస్.శ్యామూల్ పాల్‌ను శుక్రవారం పలు విద్యార్థి, ప్రజా, ఉపాధ్యాయ సంఘాల నాయకులు కలిసి అభినందనలు తెలిపారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ విద్యార్థి ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు పి.రాజీవ్‌కుమార్, ఎస్ఎఫ్ఐ జిల్లా అద్యక్ష, కార్యదర్శులు రంగప్ప, అబ్దుల్లా, రాయలసీమ యూనివర్సిటీ విభాగం అధ్యక్షుడు రామకృష్ణ కలిసి అభినందనలు తెలిపారు. అదేవిధంగా ఎస్టీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గోకారి, జనార్ధన్, రాష్ట్ర పూర్వపు ప్రధాన కార్యదర్శి తిమ్మన్న సైతం కలిసి అభినందనలు తెలిపారు.

గ్రామసభలను సద్వినియోగం చేసుకోవాలి

- డిప్యూటీ కలెక్టర్ వెంకట నారాయణమ్మ


సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ కలెక్టర్ వెంకట నారాయణమ్మ

కల్లూరు: గ్రామసభలను సద్వినియోగం చేసుకోవాలని, భూ సమస్యలను పరిష్కరించుకోవాలని డిప్యూటీ కలెక్టర్ వెంకట నారాయణమ్మ సూచించారు. శుక్రవారం కల్లూరు మండలం సల్కాపురం గ్రామంలో నిర్వహించిన గ్రామసభకు ఆమె హాజరయ్యారు. గ్రామ మ్యాప్‌పై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డిప్యూటీ కలెక్టర్ మాట్లాడుతూ భూ సమస్యల పరిష్కారానికే గ్రామసభలు నిర్వహిస్తున్నామన్నారు. భూ సమస్యలకు సంబంధించి రైతులు అర్జీలు అందజేస్తే పరిశీలించి పరిష్కార చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. సల్కాపురం రైతుల నుంచి వినతులను తహసీల్దార్ స్వీకరించారు. కార్యక్రమంలో సర్పంచ్ మద్దిలేటి, నాయకులు దేవేందర్‌రెడ్డి, సర్వేయర్లు, వీఆర్వోలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఆర్.ఖానాపురంలో గ్రామ సభ

కోడుమూరు రూరల్ : గూడూరు మండలంలోని ఆర్.ఖానాపురంలో శుక్రవారం తహసీల్దార్ రామాంజినేయులు రీసర్వేలో నెలకొన్న భూసమస్యలపై గ్రామ సభ నిర్వహించారు. 11మంది రైతుల నుంచి అర్జీలను స్వీకరించారు. కార్యక్రమంలో రీసర్వే డిప్యూటీ తహసీల్దార్ లోకేశ్వరరెడ్డి, మండల సర్వేయర్ బాలు నాయక్, వీఆర్వోలు, విలేజ్ సర్వేయర్లు పాల్గొన్నారు.

పాణ్యం: మండల పరిధిలోని గోనవరంలో శుక్రవారం తహసీల్దార్ నరేంద్రనాథ్‌రెడ్డి రీ సర్వే సమస్యలపై గ్రామ సభ నిర్వహించారు. భూ సమస్యలకు సంబంధించి రైతుల నుంచి తహసీల్దార్ దరఖాస్తులు స్వీకరించారు. దరఖాస్తులు పరిశీలించి పరిష్కార చర్యలు తీసుకుంటామన్నారు.

సి.బెళగల్: మండల పరిధిలోని ముడుమాలలో శుక్రవారం తహసీల్దార్ శ్రీనివాసరెడ్డి రీ సర్వే సమస్యలపై రెవెన్యూ సదస్సు నిర్వహించారు. వివిధ భూ సమస్యలపై రైతుల నుంచి తహసీల్దార్ దరఖాస్తులు స్వీకరించారు. కార్యక్రమంలో రీసర్వే డిప్యూటీ తహసీల్దార్ వెంకటేశ్వర్లు, మండల సర్వేయర్ నాగభూషణం, వీఆర్వోలు అక్బర్ హుసేన్, రంగముని, శ్రీనివాసులు, సాయిరమణ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న తహసీల్దార్ రామాంజినేయులు




పాణ్యంలో రైతుల సమస్యలు తెలుసుకుంటున్న అధికారులు, సి.బెళగల్‌లో తహసీల్దార్ శ్రీనివాసరెడ్డి

రగ్బీ పోటీలు ప్రారంభం

పాణ్యం: మండల పరిధిలోని నెరవాడ మెట్ట వద్ద ఉన్న ఆర్‌జీఎం ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవారం రాష్ట్రస్థాయి రబ్బీ పోటీలు ప్రారంభమయ్యాయి. పోటీలను ప్రారంభించిన డీన్ అశోక్‌కుమార్ విద్యతోపాటు క్రీడలపై విద్యార్థిలు దృష్టి సారించాలని సూచించారు. కార్యక్రమంలో క్రీడల అథారిటీ పరిశీలకులు చంద్రశేఖర్, ప్రిన్సిపాల్ మధుసూదనశెట్టి తదితరలు పాల్గొన్నారు.

బాలికలు విద్యావంతులుగా ఎదగాలి

పాణ్యం: బాలికలు విద్యావంతులుగా ఉదగాలని ఆర్జీఎం ఇంటర్‌నేషనల్ పాఠశాల ప్రిన్సిపాల్ గాయత్రి అన్నారు. శుక్రవారం స్థానిక ఆశ్రమ పాఠశాలలో విద్యార్థినులకు సామాజిక సమస్యలపై అవగాహన కల్పించారు. స్కూల్ పదేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా విద్యార్థినులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సునంద తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి రాజకీయ శిక్షణా తరగతులు

ఓర్వకల్లు: స్థానిక సీపీఐ కార్యాలయంలో ఈ నెల 26,27 తేదీలలో రాజకీయ శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నట్లు పార్టీ మండల కార్యదర్శి రమేష్ శుక్రవారం ఓ ప్రకటలో తెలిపారు. శిక్షణా తరగతులకు పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు రామచంద్రయ్య, కర్నూలు జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య, నగర కార్యదర్శి రామకృష్ణారెడ్డి హాజరవుతారన్నారు. సీపీఐ, అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని పిలుపునిచ్చారు.

నిందితుడిపై కఠిన చర్యలు తీసుకోవాలి

కర్నూలు (రూరల్): మండల పరిధిలోని బి.తాండ్రపాడులో గ్రామస్తుల సహకారంతో శివాలయ నిర్మాణం జరుగుతుండగా శుక్రవారం వడ్ల శంకరయ్య అనే వ్యక్తి తన ఇంటి పక్కనున్న శివాలయంలో నంది విగ్రహాన్ని ధ్వంసం చేసి, ఆలయ నిర్మాణాన్ని అడ్డుకోవడానికి ప్రయత్నం చేశాడని, అతనిపై కఠిన చర్యలు తీసుకోవాలని విశ్వ హిందూ పరిషత్ నాయకుడు టి.ప్రతాప్‌రెడ్డి డిమాండ్ చేశారు. నిర్మాణంలో ఉన్న అలయాన్ని ధ్వంసం చేసిన వ్యక్తిని తాలుకా పోలీసులు వెంటనే ఆధీనంలోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. సమాచారం తెలుసుకున్న భజరంగ్ దళ్ ప్రతినిధి బృందం గ్రామనికి చేరుకొని ఆలయ పరిసరాలను పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడారు. వడ్ల శంకరయ్య హిందూ సమాజానికి క్షమాపణ చెప్పాలని, అలాగే ఆలయ నిర్మాణానికి అడ్డు చెప్పకూడదని వారు డిమాండ్ చేశారు. విశ్వహిందూ పరిషత్ నాయకులు, భజరంగ్‌దళ్ నాయకులు శివసాయినాథ్, రాంబాబు, ప్రకాష్ సింగ్, మనోహర్, సింహాద్రి ఆచారి తదితరులు పాల్గొన్నారు.

బ్రిడ్జి నిర్మించకపోతే రోడ్లు దిగ్బంధిస్తాం


ఎస్ఈకి వినతి పత్రం ఇస్తున్న ఆందోళనకారులు

కర్నూలు న్యూసిటీ: కర్నూలు–ఉల్చాల రహదారిలో కూలిపోయిన బ్రిడ్జిని వెంటనే నిర్మించకపోతే రహదారులు దిగ్బంధిస్తామని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాధాకృష్ణ హెచ్చరించారు. బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని నగరంలోని రోడ్లు, భవనాల శాఖ కార్యాలయంలో సీఐటీయూ, డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టి ఎస్ఈకి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కర్నూలు నుంచి ఉల్చాల, రేమట మీదుగా మంత్రాలయం వెళ్లే రహదారిలో వాగు వద్ద బ్రిడ్జి కూలిపోయి సంవత్సరాలుగా వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంపై అధికారులకు ఎన్నిసార్లు విన్నవించుకున్నా పట్టించుకున్న పాపాన పోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి బ్రిడ్జి నిర్మాణ పనులు చేపట్టాలని కోరారు. ఈ విషయంపై ఎస్ఈ స్పందిస్తూ బ్రిడ్జి నిర్మాణానికి ప్రతిపాదనలు పంపామని, బ్రిడ్జి మంజూరై నిధులు రాగానే నిర్మాణాలు చేపడతామని హామీ ఇచ్చారు.

వార్డుబాయ్ పోస్టులను భర్తీ చేయాలి

కర్నూలు (హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో ఎంఎన్ఓ, ఎఫ్ఎన్ఓ (వార్డ్ బాయ్) స్ట్రెచర్ బేరర్ పోస్టులను భర్తీ చేయాల ని ఏపీ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్.బాలస్వామి నాయక్ మంత్రి టీజీ భరత్‌కు వినతిపత్రం అందించారు. శుక్రవారం ఆసుపత్రిలో అన్నా క్యాంటీన్‌ను ప్రారంభించేందుకు వచ్చిన మంత్రిని ఆయన కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆసుపత్రిలో 1500కు పైగా పడకలు ఉన్నాయని, ఈ సంఖ్యను బట్టి నర్సింగ్ స్టాఫ్ 650 మంది, శానిటేషన్ వర్కర్లు 350 మంది, సెక్యూరిటీ గార్డులు 250 మంది ఉన్నారన్నారు. కానీ ఎంఎన్ఓ, ఎఫ్ఎన్ఓలు, స్ట్రెచర్ బేరర్లు వంద మంది కూడా లేరన్నారు. ఈ కారణంగా ఆపరేషన్ థియేటర్లు, వార్డులు, ఓపీలలో ఒక్కొక్కరూ నా లుగైదు చోట్ల విధులు నిర్వహించాల్సి వస్తోందన్నారు. రోగులను వారితో వచ్చిన సహాయకు లే స్ట్రెచర్‌పై తీసుకెళ్లాల్సి వస్తుందన్నారు. వెంటనే పోస్టులు భర్తీ చేయాలని కోరారు.

నేడు అక్బర్‌బాషా సంస్మరణ సభ

కర్నూలు కల్చరల్: కళావాహిని సాంస్కృతిక సాహితీ సంస్థ ఆధ్వర్యంలో ప్రముఖ రంగస్థల కళాకారుడు అక్బర్ బాషా సంస్మరణ సభను నిర్వహించనున్నట్లు సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎం.మనోహర్‌బాబు తెలిపారు. శనివారం సాయంత్రం 6.30 గంటలకు మద్దూరు నగర్‌లోని పింగళి సూరన తెలుగు తోటలో నిర్వహించే కార్యక్రమంలో నారద ఏకపాత్రాభినయం , శ్రీకృష్ణతులాభారం నాటకంలోని శ్రీకృష్ణ పడక సీను, భవాని చింతామణి సీను లాంటి పౌరాణిక పద్య నాటకాల ప్రదర్శన ఉంటుందని తెలిపారు.

సన్మానం

సి.బెళగల్: మండలంలో ఈఓఆర్డీగా పనిచేసి బదిలీపై వెళ్లిన సందీప్‌ను మండల సర్పంచ్‌ల సంఘం సభ్యులు శుక్రవారం ఘనగా సన్మానించారు. ఆయనకు పూలమాలలు వేసి శాలువాలతో సత్కరించారు. డీడీ శ్యామల, ఎంపీపీ బొంతల మునెప్ప, ఎంపీడీఓ రాణెమ్మ సందీప్ సేవలను ఈ సందర్భంగా గుర్తు చేశారు.